నత్తనడకన అంగన్‌వాడీ భవన నిర్మాణాలు

- గత ప్రభుత్వంలో 14 అంగన్‌వాడీలకు నూతన భవనాలు
- తొలి విడతలో రూ.1.05 కోట్ల నిధులు విడుదల చేసిన వైఎస్ జగన్ సర్కార్
- రెండో విడత నిధులను ఏడాదిగా విడుదల చేయని కూటమి సర్కార్



ఏడాదిగా నిలిచిపోయిన బువ్వనపల్లి అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు



జల్లికొమ్మరలో పాత పంచాయతీ భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ తరగతులు

నిడమర్రు: గత ప్రభుత్వంలో నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలతో పాటు చిన్నారుల బడులైన అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గంలో ఫేజ్–2లో 14 అంగన్‌వాడీలకు నూతన భవనాల నిర్మాణాలకు గత ప్రభుత్వంలో నాడు–నేడు పథకంలో ప్రారంభించారు. వీటి నిర్మాణాలకు అవసరమైన నిధుల్లో తొలి విడతగా ఒక్కో భవన నిర్మాణానికి సుమారు రూ.7.5 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో అప్పట్లో వీటి నిర్మాణ పనులు వేగంగా చేశారు. మలివిడత నిధుల మంజూరుకు అప్పట్లో ఎన్నికల కోడ్ రావడంతో నిధుల విడుదల నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. అనంతరం అధికారం చేపట్టిన కూటమి సర్కారు మిగిలిన రెండో విడత నిధుల మంజూరు నిలిపి వేయడంతో ప్రస్తుతం గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. తొలి విడత నిధులతో బేస్‌మెంట్, శ్లాబ్, గోడలు పూర్తి చేసుకొని ప్లాస్టింగ్, కిటికీలు, తలుపుల వంటి పనులకు నిధుల కోసం ఆ భవనాలు ఎదురు చూస్తున్నాయి.

నియోజకవర్గంలో 14 అంగన్‌వాడీ కేంద్రాలు

ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం ఉండాలనే లక్ష్యంతో ఫేజ్–2 నాడు–నేడు పథకంలో కొత్తగా అంగన్‌వాడీ భవనాలను నాటి సర్కారు మంజూరు చేసింది. నిడమర్రు మండలంలో నిడమర్రు, పెందనింద్రకొలను, మందలపర్రు, క్రొవ్విడి ఉప్పరగుడెం అంగన్‌వాడీ కేంద్రాలకు, ఉంగుటూరు మండలంలో ఎ.గోపవరం–2, బాదంపూడి అంగన్‌వాడీ కేంద్రాలకు గణపవరంలో జల్లికొమ్మర, సీహెచ్ అగ్రహారం, సరిపల్లి, గణపవరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు, భీమడోలు మండలంలో 4 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేలా నాటి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రస్తుతం వాటి నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఏడాది కావస్తున్నా అంగుళం కూడా కొత్త పనులకు నోచుకోలేని పరిస్థితి నెలకొంది.

నిధుల వినియోగం పారదర్శకంగా..

ఈ అంగన్‌వాడీ కేంద్ర భవనాల నిర్మాణంలో ప్రైవేట్ కాంట్రాక్టర్లు, ఇత ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేకుండా నాడు–నేడు పథకంలో, నాడు–నేడు కమిటీ పేరుతో ఈ పనులు చేపట్టారు. ఈ కమిటీలో ఆయా పరిధిలోని తల్లులను భాగస్వామ్యం చేస్తూ తల్లుల కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్, సూపర్‌వైజర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉంటారు. వీరి ఆధ్వర్యంలో ఈ భవన నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం ఈ నాడు–నేడు ఖాతాలు రెండో విడత నిధుల కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రస్తుతం అవి అద్దె భవనాల్లో, పాత పంచాయతీ భవనాల్లో, కమ్యూనిటీ సెంటర్లలోని పాత గదుల్లో కొనసాగుతున్నాయి. ఇరుకుగా అరకొర వసతులున్న ఆ భవనాల్లో చిన్నారులను ఆడించాలన్నా, వారికి భోజనం వండి వడ్డించాలన్నా, చదువు చెప్పాలన్నా ఇబ్బందిగా మారిందని అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు, పలువురు చెబుతున్నారు.

పాత పంచాయతీ భవనంలో ఉంది



గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–18 ప్రస్తుతం పాత పంచాయతీ భవనంలో కొనసాగుతోంది. గత ప్రభుత్వంలో నాడు–నేడు పథకంలో ఈ కేంద్రానికి నూతన భవనం మంజూరైంది. ఆ నిర్మాణానికి సంబంధించి ఫేజ్–2 రెండో విడత నిధులు విడుదల చేయకపోవడంతో ఆ భవనం అసంపూర్తిగా ఉంది.

– కుర్రెళ్ల వెంకట రత్నం, సర్పంచ్, జల్లికొమ్మర

అవసరమైన నిధులు విడుదల చేయాలి



గ్రామంలోని సచివాలయం–2 వద్ద నాడు–నేడు పథకం ఫేజ్–2లో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవన నిర్మాణం ప్రారంభించారు. అధికారంలోకి వచ్చి కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయినా నేటికీ అవసరమైన నిధులు విడుదల చేయలేదు. దీంతో చిన్నారుల కేంద్రం అరకొర వసతులున్న అద్దె భవనంలో కొనసాగాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి చిన్నారులకు, సిబ్బందికి సొంత భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

– వెల్లంకి సరేష్, ఉప సర్పంచ్, బువ్వనపల్లి

క్లుప్తంగా

పాఠశాలకు కుర్చీలు, ఫ్యాన్ల బహూకరణ



పాఠశాలకు కుర్చీలు, ఫ్యాన్లు అందజేస్తున్న దాత

దెందులూరు: దెందులూరు గారపాటి హైమావతిదేవి ఉన్నత పాఠశాలకు దాత, వైఎస్సార్ సీపీ నేత ధరణికోట పోతురాజు కుర్చీలు, ఫ్యాన్లను బహూకరించారు. సోమవారం పాఠశాల హెచ్ఎం వడ్లపట్ల విజయకుమార్‌కు అందజేశారు. తన వంతు సాయంగా 5 కుర్చీలు, 4 ఫ్యాన్లను పాఠశాలకు అందించారు. ఆయనను ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పి.పల్లారెడ్డి, గ్రంథపాలకులు గుళ్లపూడి వెంకటేశ్వరరావు అభినందించారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ



పేదలకు ఆహారం ప్యాకెట్లు అందిస్తున్న లయన్స్ సభ్యులు

గణపవరం: గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం గణపవరం పట్టణంలో పేదలు, వలస కూలీలు, బిక్షాటన చేసుకునే వారికి ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. బువ్వనపల్లి, గణపవరం తదితర ప్రాంతాల్లోని పేదలు, బిచ్చగాళ్లు, ఈ ఆహార పొట్లాలను తీసుకున్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెల్లంకి నరేష్, కార్యదర్శి కిలారి రవి, కోశాధికారి కేఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

రైతులతో ఎమ్మెల్యే సమావేశం

ఉంగుటూరు: పత్తేపురం పంట కాలువ సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సోమవారం పంటలు నీట మునిగిన రైతులతో క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. తోకలపల్లి మురుగుకోడు షట్టర్లు మూసి పత్తేపురం పంట కాలువకు నీరు వదలటంతో రావులపర్రు ఆయకట్టులో నారుముళ్లు నీట మునిగాయి. ఈ నేపథ్యంలో రైతులతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే ఘటనపై వారి అభిప్రాయాలు సేకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట ముంపు విషయం తెలియగానే తోకలపల్లి మేజర్ కాలువ, పత్తేపురం పంట కాలువలోకి నీటి ప్రవాహాన్ని నియంత్రించేలా కాగుపాడు లాకుల వద్ద, పందికోడు కాలువ వద్ద చర్యలు తీసుకొనేలా అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. సమావేశంలో రావులపర్రు, సీతారామపురం, రాచూరు, పత్తేపురం, తోకలపల్లి, బైనేపల్లి, ఆముదలపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజ స్థాపనలో భాగస్వామ్యం కావాలి

భీమడోలు: క్షయ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఆసుపత్రి అభివృద్ధి నిధులతో చేపట్టిన కార్యక్రమాలు, వసతులపై ఆయన ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఆనంద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీబీ సూపర్‌వైజర్ తోట మనోజ్‌కుమార్, ల్యాబ్ సూపర్‌వైజర్ రవిసింగ్, టెక్నీషియన్ వసంతరావు, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, మణికంఠ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకార కార్యక్రమ దృశ్యం

భీమడోలు: భీమడోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం సోమవారం ఏఎంసీ కార్యాలయంలో నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే పి.ధర్మరాజుతో పాటు నూతన కమిటీ సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ శేషపు శేషగిరి, వైఎస్ చైర్మన్ నిమ్మకాయల గణపతితో పాటు మరో 13 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బల్గేరియా, అల్బేనియా దేశాల్లో ఉద్యోగాల నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్ జితేంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మెకానికల్ డిజైన్ ఇంజినీర్లు, ఫ్యాక్టరీ మెకానిక్స్, ఫ్యాక్టరీ ఎలక్ట్రీషియన్లకు యూరప్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించే అంతర్జాతీయ నియామక కార్యక్రమాన్ని ప్రకటించాయన్నారు. వివరాలకు అభ్యర్థులు హెల్ప్ లైన్ నంబర్ +91–9988853335లో సంప్రదించవచ్చని, ఈ నెల 23తో దరఖాస్తు గడువు ముగుస్తుందని పేర్కొన్నారు.

సామాన్యులకు భారంగా కూరగాయల ధరలు



సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

గణపవరం: కూరగాయల ధరలు కొండెక్కడంతో వినియోగదారులు గగ్గోలు పెట్టారు. పచ్చిమిర్చి ధర ఘాటెక్కింది. కిలో మిర్చి రూ.100 పలికింది. ఉల్లిధర రూ.30కు చేరింది. మిగిలిన అన్ని రకాల కూరగాయల ధరలూ భగ్గుమన్నాయి. కూరగాయల ఖర్చు పెరిగిపోవడంతో పేద మధ్య తరగతి ప్రజలు లబోదిబోమంటున్నారు. మార్కెట్‌లో కూరగాయల ధరలు చూస్తే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. డైలీ మార్కెట్‌లో కూరగాయల ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. సోమవారం గణపవరంలో నిర్వహించిన వారపు సంతలో కూరగాయల ధరలు వినియోగదారుల గుబగుయ్యి మనిపించాయి. దీంతో వినియోగదారులు కూరగాయలు సగానికి సగం తగ్గించి కొనుగోలు చేశారు.

సంతలో కూరగాయల ధరలు ఇలా..

ఉల్లి కిలో రూ.30, పచ్చి మిర్చి రూ.100, బీర రూ.60, వంకాయలు రూ.40, బెండ రూ.50, క్యారెట్ రూ.50, బీట్‌రూట్ రూ.50, దోస రూ.30, దొండ రూ.40, కాకర రూ.60, ఆకాకర రూ.80, కీరదోస రూ.80, కంద రూ.50, చిక్కుడు రూ.120, టమాట రూ.40, అల్లం రూ.80, మునగ రూ.10, ఆనబ రూ.30, బీన్స్ రూ.60, క్యాప్సికం రూ 50, క్యాబేజి రూ.30, కాలిఫ్లవర్ రూ.30 చొప్పున పలికాయి. ఆకుకూరల ధరలూ భగ్గుమన్నాయి. తోటకూర, గోంగూర, పాలకూర తదితర రకాలు కట్ట రూ.20 చొప్పున విక్రయించారు.

మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెదపాడు: వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారంటూ వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అప్పన కనకదుర్గా ప్రసాద్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని అప్పనవీడుతో పాటు పలు గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొని ప్రభుత్వం అక్రమ అరెస్టులను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వ తీరును ఖండిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం రెడ్ బుక్ పాలన సాగిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి, వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి, సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, ఎంపీటీసీ బుద్దే రామసీత, సీనియర్ నాయకుడు గారపాటి భాస్కరరావు, వడ్రపు కోటిరెడ్డి, సంబంగి శ్రావణ్ కుమార్, బత్తుల ఏసురాజు, బెజవాడ సత్యనారాయణ, షేక్ వలీ, వీరవల్లి వెంకేశ్వరరావు, బెజవాడ శేఖర్, బెజవాడ సత్యనారాయణ, సూరపనేని బాల వెంకట రమణ, సర్పంచ్ మరీదు రెడ్డియ్య, సీనియర్ నాయకుడు ఆళ్ల సతీష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేయాలి



బాలికల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

భీమడోలు: విద్యార్థులకు ఉత్తమ శిక్షణ, మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అధికారులు పని చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. పోలసానిపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాలను సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. గత మే నెలాఖరున కూలిపోయిన రెండు శ్లాబుల ప్రాంతాన్ని అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. కూలడం వలన తరగతులు నిర్వహించకపోవడానికి గల కారణాలతో పాటు పాఠశాల నిర్వహణ, ఇతర కార్యకలాపాలపై ప్రిన్సిపాల్ ఎన్.భారతి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ విద్యార్థినులను ద్వారకాతిరుమల గురుకుల కళాశాలకు తరలించామని, ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు బాలికలు చేరుకుంటున్నారని, వారికి పగటి పూట తరగతులు నిర్వహణ, రాత్రి వేళ్లలో అక్కడే నిద్రపోతారని, అందుకు తగిన ఏర్పాట్లు చేశామని జెడ్పీ చైర్‌పర్సన్‌కు వివరించారు. తరగతి గదుల పటిష్టతపై కాకినాడ జేఎన్‌టీయూ అధికారుల బృందం వచ్చి వాటిని పరిశీలిస్తారని, వారిచ్చే నివేదిక ఆధారంగా అధికారుల నిర్ణయం ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థినుల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కళాశాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారికి సూచించారు. విద్యార్థులతో ఆమె మాట్లాడారు. కళాశాలలో భవనాల మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలను తయారు చేసి, జెడ్పీకి పంపాలని ఏఈని ఆమె ఆదేశించారు. తక్షణమే సంబంధిత పనులకు నిధులు మంజూరయ్యే చర్యలు తీసుకుంటామని జెడ్పీ చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో–1 ఈదుపల్లి శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారుమళ్ల మునకపై కలెక్టర్‌కు ఫిర్యాదు



ఆందోళన చేస్తున్న రైతులు

ఉంగుటూరు: పత్తేపురం పంట కాలువకు నీరు విడుదల చేయడంతో నారుమళ్లు మునిగిపోయాయని రైతులు ఆందోళన చేశారు. సోమవారం ఈ విషయంపై కలెక్టర్ కె.వెట్రిసెల్వికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పత్తేపురం పంట కాలువకు నీరు విడుదల చేయడానికి రావులపర్రు వద్ద తోకలపల్లి మురుగుకోడు అడ్డుకట్ట వేయడంతో అధిక నీరు ప్రవహించి నారుమళ్లు మునిగిపోయాయన్నారు. సోమవారం ఏలూరు వెళ్లిన రైతులు ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు న్యాయం చేస్తామని కలెక్టర్ చెప్పినట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు గాడి రమణ తెలిపారు.

పీఎం జన్మాన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని కొండరెడ్డి గిరిజన గ్రామాల్లో పీఎం జన్మాన్ పథకంలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ అన్నారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ మీటింగ్ హాల్‌లో వివిధ శాఖలకు చెందిన అధికారులతో పీఎం జన్మాన్ పనుల పురోగతిపై సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలు, భవనాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే అప్‌గ్రేడ్ విద్యుత్ పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. పీవీటీజీ కుటుంబాలకు మంచినీటి కుళాయిలు బిగించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖలకు చెందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జీఆర్ఎస్‌లో అర్జీల స్వీకరణ



అర్జీదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో పద్మావతీదేవి

భీమడోలు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో (పీజీఆర్ఎస్) పలు అర్జీలు అందాయి. తహసీల్దార్ బి.రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి పలు శాఖల అధికారులు హాజరయ్యారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం గ్రామంలో ఇద్దరు పిల్లలకు సంరక్షకునిగా ఉన్న తనకు తల్లికి వందనం పథకంలో నగదు నా వ్యక్తిగత ఖాతాకు జమ కాలేదని, ఆయన అర్జీని అందించారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. పూళ్లలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదు చేశారు. విద్యా హక్కు చట్టం మేరకు ప్రైవేట్ కాన్వెంట్లలో సీట్లు పొందిన వారు తమకు తల్లికి వందనం డబ్బులు రాలేదని ఫిర్యాదు చేశారు. ఆర్‌టీఈలో ప్రభుత్వం ఉచితంగా చదివిస్తుందని, దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వారు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులు, వికలాంగులకు ఇంటింటికీ రేషన్ ఇవ్వాలి



రేషన్ పంపిణీపై అవగాహన కల్పిస్తున్న డీఎస్‌వో బాబు విలియమ్స్

భీమడోలు: వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక రోగులకు ఇంటింటికీ వెళ్లి రేషన్ సరుకులను అందించాల్సిన బాధ్యత రేషన్ డీలర్లపై ఉందని జిల్లా పౌర సరఫరాల అధికారి బాబు విలియమ్స్ అన్నారు. పూళ్ల కల్యాణ మండపంలో సోమవారం ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు మండలాల సీఎస్ డీటీలు, రేషన్ డీలర్లకు రేషన్ పంపిణీపై ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సీఎస్‌డీటీ ఎన్.భరత్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్‌వో బాబు విలియమ్స్ మాట్లాడుతూ ఆగస్టుకు సంబంధించి 65 ఏళ్లు నిండిన వృద్ధులు, వికలాంగులు, మంచం పట్టిన వారికి ఈ నెల 26వ తేదీ నుంచి నెలాఖరు వరకు సచివాలయ ఉద్యోగులతో కలిసి డీలర్లు ఇంటింటికీ వెళ్లి రేషన్ పంపిణీ చేయాలన్నారు. భీమడోలు మండలంలో 2406 మందికి, ఉంగుటూరు 3452 మందికి, నిడమర్రు 2129 మందికి ఇంటింటికీ వెళ్లి నూరుశాతం రేషన్ సరుకులను పంపిణీ చేయాలన్నారు. రేషన్ దుకాణాలకు సున్నం వేయించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రేషన్ కార్డుదారులకు ఆగస్టు 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ సరుకులను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీలు స్వర్ణ దుర్గ, మల్లికా జరీనా, డీలర్లు పాల్గొన్నారు.

రేపు పల్లకీ సేవ

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గమ్మ ఆలయంలో బుధవారం పల్లకీసేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. మాస శివరాత్రి పురస్కరించుకుని శివపార్వతుల పంచలోహ ఉత్సవ విగ్రహాలకు సన్నాయి మేళ తాళాల మధ్య పట్టణ ప్రధాన వీధుల్లో పల్లకీసేవ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

నిర్లక్ష్యపు నీడలో కాలిబాట వంతెన

- శిథిలావస్థకు చేరుతున్న వంతెన
- అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల వేడుకోలు



కాలిబాట వంతెన ఎక్కే ప్రదేశంలో అపరిశుభ్రత



కాలిబాట వంతెనపై నిలిచిన వర్షపు నీరు



పాడైన కాలిబాట వంతెన రెయిలింగ్

గణపవరం: గణపవరం వెంకయ్య కాలువపై వెలంపేట వద్ద మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన కాలిబాట వంతెనకు అధికారుల నిర్లక్ష్యంతో కష్టకాలం దాపురించింది. ఇప్పటికైనా ఈ వంతెన నిర్వహణ పట్టించుకోక పోతే అనతి కాలంలోనే వంతెన శిథిలావస్థకు చేరి కూలిపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గణపవరం పట్టణంలో రోజు రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకొని 1990లో అప్పటి అత్తిలి ఎమ్మెల్యే దండు శివరామరాజు కృషితో వెలంపేట వద్ద వెంకయ్య వయ్యేరుపై ఈ కాలిబాట వంతెన నిర్మించారు. ఈ వంతెన నిర్మించిన తరువాత గణపవరం పట్టణంలో చాలా వరకూ ట్రాఫిక్ సమస్య తగ్గింది. ఆకివీడు, పెద కాపవరం, చినకాపవరం, బావాయిపాలెం, చానమిల్లి, సిద్ధాపురం, క్రొవ్విడి, గొల్లగూడెం తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలు, ద్విచక్ర వాహనదారులు గణపవరం సెంటర్‌కు రాకుండా ఈ వంతెన మీదుగా ఆయా గ్రామాలకు వెళుతున్నారు. దీంతో గణపవరం సెంటర్‌లో ట్రాఫిక్ రద్దీ కొంత వరకూ తగ్గింది.

ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు ఉపయోగం

గణపవరం బొబ్బిలి వంతెన మీద, పోలీస్ ఐలెండ్ దగ్గర, వంతెన దిగువన ఆకివీడు రోడ్డు కూడలి వద్ద ట్రాఫిక్ స్తంభించిన సందర్భాల్లో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఈ వంతెన మీదుగా ట్రాఫిక్ వలయంలో చిక్కకుండా ప్రయాణాలు సాగిస్తుంటారు. అలాగే గణపవరం, సరిపల్లె, చినరామచంద్రపురం గ్రామాల రైతులు తమ పొలాలకు వెళ్లడానికి, కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లడానికి ఈ వంతెన ఎంతో ఉపయోగపడుతుంది. ఇంత ప్రాముఖ్యత కలిగిన ఈ వంతెన పట్ల అధికారుల నిర్లక్ష్యం కారణంగా వంతెన మనుగడకే ముప్పు కలుగుతుంది. కొన్నేళ్లుగా వంతెన సిమెంట్ రైలింగ్ విరిగిపోయి ఇనుప ఊచలు బయటకు పొడుచుకొచ్చి ప్రమాదభరితంగా మారాయి. వంతెన శ్లాబ్ గుంతలు పడి వర్షం వస్తే వారం రోజుల వరకూ వంతెనపై నీరు నిల్వ ఉంటుంది. వాహనాలు ఆ నీటి గుండానే రాకపోకలు సాగించడంతో గుంతలు అంతకంతకు పెద్దవై వంతెన మనుగడకే ముప్పుగా తయారవుతున్నాయి. ఇక వంతెన పైకి ఎక్కే ప్రదేశం పల్లంగా ఉండటంతో ఆ గుంతలో నీరు చేరుతుంది. ఈ నీటిలోనే వాహనాలు వెళ్లాల్సి రావడం ఇబ్బందికరంగా ఉంది. వంతెన పక్కనే కాలువ గర్భంలో స్థానికులు పెంటకుప్పలు, చెత్తాచెదారం వేయడంతో ఆ చెత్త కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వంతెన నిర్వహణ చర్యలు చేపట్టి వంతెన మరి కొంత కాలం సేవలందించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఇరుకు వంతెనతో ఇక్కట్లు

ఈ ఫుట్‌పాత్ వంతెన అప్పటి అవసరాలకు అనుగుణంగా నిర్మించినా, ఇప్పటి అవసరాలకు ఏ మాత్రం సరిపోవడం లేదు. ఈ మూడు దశాబ్దాల కాలంలో ట్రాఫిక్ సమస్య పది రెట్లు పెరిగింది. దీంతో గణపవరం ప్రధాన రోడ్లు నిత్యం రద్దీగా ఉంటూ తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ట్రాఫిక్ నిలిచిపోయిన సమయంలో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఈ కాలిబాట వంతెన మీదుగా ప్రయాణిస్తుంటారు. ఈ వంతెన ఇరుకుగా ఉండటంతో ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లడానికి వీలవుతుంది. కనీసం ఆటోలు, ట్యాక్సీలు వంటివి వెళ్లేలా ఈ కాలిబాట వంతెనను విస్తరిస్తే ట్రాఫిక్ సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

వైఎస్సార్ సీపీ నేత ఫిర్యాదుతో కదిలిన అధికార యంత్రాంగం



ద్వారకానగర్‌లో డ్రెయినేజీపై నిర్మించిన చప్టాలను తొలగిస్తున్న జేసీబీ

ద్వారకాతిరుమల: మండలంలోని ద్వారకానగర్ (భీమడోలు జంక్షన్)లో డ్రెయినేజీ సమస్యపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం కార్యదర్శి, భీమడోలు ఎంపీటీసీ సభ్యుడు ముళ్లగిరి జాన్సన్ చేసిన ఫిర్యాదుపై అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఈ క్రమంలో జేసీబీతో డ్రెయినేజీని శుభ్రం చేశారు. వివరాల్లోకి వెళితే.. ఉదయగిరి త్రినాథ్ అనే వ్యక్తి మురుగు కాలువను పూడ్చి బిల్డింగ్ నిర్మిస్తున్నారని, దీని కారణంగా జంక్షన్, స్టేట్ బ్యాంక్ వెనుక కాలనీలో ఇళ్లలోని మురుగు నీరు, వర్షపు నీరు దిగువ ప్రాంతానికి పారే వీలు ఉండదని గత నెల 23న జాన్సన్ పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు హుటాహుటిన జంక్షన్ నుంచి దిగువ ప్రాంతం వరకు పూడుకుపోయిన మురుగు కాలువలను శుభ్రం చేశారు. అందులో భాగంగా డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలను జేసీబీ సహాయంతో తొలగించారు. అలాగే భవన నిర్మాణ ప్రాంతంలో డ్రెయినేజీ సమస్య తలెత్తకుండా అధికారులు తగు చర్యలు చేపడుతున్నారని జాన్సన్ తెలిపారు. సమస్యపై స్పందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.